సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

శిథిల భవనాల తొలగింపునకు 4న వేలం

భీమునిపట్నం: భీమిలిలోని ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాల వద్దనున్న శిథిల భవనాల తొలగింపునకు జూన్ నాలుగో తేదీన వేలం పాట జరుగుతుందని ప్రిన్సిపాల్ జయకుమారరావు గురువారం తెలిపారు. ఇక్కడి డైనింగ్ హాల్, వంటగది, స్టోర్‌రూమ్‌లకు సంబంధించిన భవనాలు శిథిలమైపోవడంతో వాటి తొలగింపునకు 28న జరగవలసిన వేలం పాటను అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు చెప్పారు. జూన్ 4న ఉదయం 11గంటలకు జరిగే వేలంలో ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు. ఇతర వివరాలకు 8712625025, 8309519107 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం రేపు



ఆలయాన్ని అలంకరిస్తున్న నిర్వాహకులు

తగరపువలస: స్థానిక బైపాస్‌రోడ్డులోని శ్రీవిజయదుర్గాదేవి, విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్య స్వామి వార్ల ఆలయ 12వ వార్షికోత్సవం శనివారం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని నిర్వాహకులు వరికంకులు, వేపాకుమాలలు, పూల దండలతో అలంకరిస్తున్నారు. వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు, అన్నప్రసాదాల పంపిణీ చేయనున్నట్టు ఆలయ నిర్వాహకుడు రాజగిరి కుసుమహర తెలిపారు.

ముగిసిన యోగా పోటీలు



చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీహైస్కూల్‌లో రెండు రోజుల పాటు జరిగిన యోగాసనాల పోటీలు గురువారం ముగిశాయి. ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ ప్రతిభ, ఫిజికల్ డైరెక్టర్ చిల్ల వెంకటరెడ్డి, సీఆర్‌ఎంటీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. బుధవారం జరిగిన సూర్య నమస్కార్, మెడిటేషన్ పోటీలలో సుష్మిత ప్రియాంక, ఎన్.కనకమ్మ, ఎస్.నూకరత్నం.. జూనియర్స్ విభాగంలో డ్రాయింగ్, సింక్రనైజ్డ్ యోగా పోటీలలో టి.హర్షిణి, పి.కావ్యశ్రీ, టి.లాస్య బహుమతులు గెలుచుకున్నారు. యూత్ విభాగంలో ఎస్.కనకమ్మ, పి.లక్ష్మి, బి.సత్యవతి, సీనియర్స్ విభాగంలో ఎల్.సూర్యనారాయణ, యూవీ రమణమ్మ, బి.వరలక్ష్మి వరుసగా బహుమతులు గెలుచుకున్నారు. ఈ పోటీలను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నమ్మి సూర్యనారాయణ, ఉపాధ్యాయులు కానూరి భాస్కరరావు, పక్కి నాగేశ్వరరావు, కె.జగన్నాధం, పి.జయంత్‌కుమార్, రాంప్రసాద్, ఆనంద్, ఎస్ఎస్ఏ పీఈటీలు మేరీ గోల్డ్, పద్మావతి, అనురాధ, నూకరత్నం, రాజు పర్యవేక్షించారు.


స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లకు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్‌ఎం రవి తదితరులు

మధురవాడ: క్రమశిక్షణ, విలువలకు స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు ప్రతీకలని చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రవి అన్నారు. వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో రాష్ట్రస్థాయిలో శిక్షణ పూర్తి చేసుకున్న ఉత్తమ విద్యార్థులకు తృతీయ సోపాన్, రాజ్య పురస్కార్ సర్టిఫికెట్లు అందించారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ రాజ్య పురస్కార్ సాధించిన విద్యార్థులకు ఉన్నతస్థాయి విద్యాభ్యాసం, ఉద్యోగ సాధనలోనూ ప్రాధాన్యం లభిస్తుందన్నారు. స్కౌట్స్ జిల్లా కార్యదర్శి డి.వేణుగోపాల్ మాట్లాడుతూ రాజ్య పురస్కార్ అనంతరం ఒక సంవత్సరం శిక్షణ పొందితే రాష్ట్రపతి జారీ చేసే సర్టిఫికెట్ పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ జిల్లా కమిషనర్ ఆర్.మధుసూదనరావు, రాష్ట్ర సహాయ కమిషనర్ అహమ్మద్ షరీఫ్, గైడ్స్ కెప్టెన్ జి.ఉషారాణి, కె.ఎల్.ప్రసన్న కుమార్, స్కౌట్స్ మాస్టర్ ఎస్. సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ మాకొద్దు



బంగ్లామెట్టవాసులకు సెల్‌టవర్ గుబులు పట్టుకుంది. పదేళ్ల క్రితం బీఎస్ఎన్ఎల్ ఏర్పాటు చేసిన సెల్‌టవర్ వద్ద యాంటెనాలు పెరిగిపోతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రేడియేషన్ ప్రభావంతో అనారోగ్యం బారిన పడుతున్నామని, జనావాసాలకు దూరంగా తరలించాలంటూ ఆందోళనబాట పడుతున్నారు..

బంగ్లామెట్ట వాసుల ఆందోళన

రేడియేషన్‌తో వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన

బీఎస్ఎన్ఎల్ 4జీ అభివృద్ధి పనులపై అభ్యంతరం

‘అరణ్యరోదనే’

సెల్‌టవర్ ఏర్పాటు చేసినప్పటి నుంచి తామంతా వ్యతిరేకిస్తున్నా అరణ్యరోదనగానే మిగిలిందని బంగ్లామెట్ట వాసులు వాపోతున్నారు. ఇటీవల చిల్లపేట, బంగ్లామెట్ట, చిట్టివలస గ్రామాలలో స్థానికులంతా కలిసి కొత్తగా సెల్‌టవర్ల నిర్మాణాన్ని అడ్డుకుని విజయం సాధించారన్నారు. గతంలో జోగా వారి వీధిలో రేడియేషన్ కారణంగా పలు మరణాలు సంభవించిన తర్వాత అక్కడివారి ఆందోళనలతో సెల్‌టవర్ తొలగించిన సంఘటన గుర్తు చేస్తున్నారు. కేవలం బీఎస్ఎన్ఎల్ కాకుండా ఇతర నెట్‌వర్క్‌లకు సంబంధించి ఆయా యాజమాన్యాలు దౌర్జన్యంగా ఏంటెనాలు ఏర్పాటు చేయడమే కాకుండా ఈ ప్రాంతంలోని భూగర్భంలో యంత్రాలు కూడా ప్రతిష్టిస్తున్నట్టు ఆరోపిస్తున్నారు.



సెల్‌టవర్ వద్ద బీఎస్ఎన్ఎల్ 4జీ మెటీరియల్



బీఎస్ఎన్ఎల్ ఉద్యోగితో స్థానికుల వాగ్వాదం

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు బంగ్లామెట్టపై పదేళ్ల క్రితం బీఎస్ఎన్ఎల్ యాజమాన్యం సెల్‌టవర్ ఏర్పాటు చేసింది. ఈ టవర్‌కు బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించి 9 ఏంటెనాలు ఉండగా, జియో నెట్‌వర్క్‌కు 6 ఏంటెనాలు ఉన్నాయి. నెట్‌వర్క్‌లకు జనరేషన్ పెరిగే కొద్దీ టవర్‌కు కొత్తగా ఏంటెనాలు వచ్చి చేరుతున్నాయి. జియో ద్వారా 5జీ సేవలు అందుతుండగా బీఎస్ఎన్ఎల్ ద్వారా 4జీ సేవలు అందించడానికి ఇక్కడ సిబ్బంది అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ పనులు జరుగుతున్న ప్రతిసారీ బంగ్లామెట్టతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. సెల్‌టవర్ నుంచి వచ్చే రేడియేషన్ కారణంగా తామంతా వయసుతో సంబంధం లేకుండా క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు, మైగ్రెన్, జుత్తు రాలిపోవడం, గుండెదడ, కాళ్ల తిమ్మిర్లు, ఎముకల బలహీనత వంటి వ్యాధులకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరికి నచ్చజెప్పడానికి నిర్వాహకులకు తల ప్రాణం తోకకు వస్తోంది.

బీఎస్ఎన్ఎల్ సిబ్బంది అవగాహన

దీనిపై బీఎస్ఎన్ఎల్ సిబ్బంది స్థానికులకు తరచూ అవగాహన కల్పిస్తున్నారు. సెల్‌టవర్ వద్ద ఉన్నంత మాత్రాన రేడియేషన్ సోకదని సిగ్నల్స్ ప్రయాణించే మార్గాల గురించి వివరిస్తున్నారు. సెల్‌టవర్ల ఏర్పాటు అభివృద్ధిలో భాగమని, ముఖ్యంగా బీఎస్ఎన్ఎల్ సంస్థ మారుమూల ప్రాంతాలకు కూడా కమ్యూనికేషన్ సేవలు అందించాలన్న లక్ష్యంతో సేవాదృక్పథంతో పని చేస్తున్నట్టు తెలిపారు. తమ విధులకు ఆటంకాలు కలిగిస్తే జరిగే పరిణామాల గురించి కూడా స్థానికులతో పంచుకుంటున్నారు. అయినప్పటికీ స్థానికులు మాత్రం ప్రైవేట్ నెట్‌వర్క్‌కు సంబంధించిన ఏంటెనాలు తొలగించి, తమ ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయనున్నారు.

ప్రైవేట్ నెట్‌వర్క్ యాంటెనాలు తీసేయాలి

బీఎస్ఎన్ఎల్ తప్పితే మిగతా నెట్‌వర్క్‌లకు సంబంధించి ఏంటెనాలు ఇక్కడ ఉండకూడదని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. లేదంటే తాము బంగ్లామెట్టను విడిచి దూరంగా వెళ్లిపోయే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి విద్యుత్ స్తంభాలకు నెట్‌వర్క్‌లకు సంబంధించిన వైర్లు చుట్టేయడంతో తరచూ తాము ప్రమాదాలకు గురవుతున్నామని అంటున్నారు. బంగ్లామెట్టపై ప్రస్తుతం 300కు పైగా కుటుంబాలు నివసిస్తుండమే కాకుండా సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహం, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, పక్కనే పురాతన శివాలయం ఉన్నాయి. ఇంకా బంగ్లామెట్టను అనుకుని వెంకటేశ్వరమెట్ట, వెంపాడ వారి వీధి, భోగాపురపువారి వీధి, శ్రీనగర్ కాలనీ, రామన్నపేట, బాలాజీనగర్, పాత లోకల్ ఆఫీసు వీధి తదితర గ్రామాలు ఉన్నాయి.



బంగ్లామెట్టపై సెల్‌టవర్

ఇంట్లో అందరికీ అనారోగ్యం



మా ఇంట్లో నాతో పాటు మా అమ్మాయికి, మనుమడికి ఆరోగ్యం బాగుండటం లేదు. దీనికి రేడియేషన్ ప్రభావమే కారణమని వైద్య సిబ్బంది చెపుతున్నారు. దినదిన గండంగా బంగ్లామెట్టపై జీవనం వెళ్లదీస్తున్నాం. **–గోవు కొండమ్మ**, బంగ్లామెట్ట

జనావాసాలకు దూరంగా తరలించాలి



సెల్‌టవర్ ప్రభావం కారణంగా ఈ ప్రాంతంలో చాలామంది తరచూ మానసిక ఆందోళనలకు గురవుతున్నారు. నిద్రలేమి సమస్యలతో ఇబ్బంది పడుతున్నవారు ఉన్నారు. ఈ సెల్‌టవర్‌ను నివాసాల మధ్య నుంచి జనావాసం లేని ప్రాంతాలకు తరలించాలి. **– తమ్మిన ఆదిలక్ష్మి**, బంగ్లామెట్ట

కలెక్టర్ దృష్టికి సమస్య



సెల్‌టవర్ కారణంగా ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్యపరమైన సమస్యలను కలెక్టర్ దృష్టికి వినతులు ఇవ్వడం ద్వారా తీసుకువెళతాం. ప్రజా సంఘాలు,, రాజకీయపార్టీలు అండగా రావాలని కోరుతున్నాం. సమస్య పరిష్కారానికి అందరి సహకారం అవసరం. **–పాలె రవి**, బంగ్లామెట్ట

ముందు నుంచి వద్దంటున్నా..



సెల్‌టవర్‌ను ప్రారంభంలో వ్యతిరేకించినా ఎవరూ మా మొర వినలేదు. తరువాత ప్రైవేట్ యాజమాన్యాలు ఈ టవర్‌తో పాటు విద్యుత్ స్తంభాలను ఆక్రమించాయి. కాలం గడిచేకొద్దీ ఇది దీర్ఘకాలిక సమస్యగా బంగ్లామెట్టవాసులకు తయారైంది. **– గరే ప్రసాద్**, బంగ్లామెట్ట

విద్యుత్ తీగలపై లతలను తొలగించారు



విద్యుత్ తీగలకు అల్లుకున్న లతలను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: సాగర్‌నగర్‌లో విద్యుత్ తీగలను పెద్ద ఎత్తున అల్లుకున్న పచ్చని లతలను విద్యుత్ శాఖ సిబ్బంది గురువారం తొలగించారు. జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ప్రాంతంలో గుబురుగా అల్లుకున్న విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉండడంతో ‘పచ్చని పందిరి కాదు - ప్రమాదానికి ద్వారం’ శీర్షికతో సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించారు. గురువారం ఉదయమే విద్యుత్ వైర్లకు అల్లుకున్న పచ్చని లతలను తొలగించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పీఎం పాలెం: స్థానిక పీఎం పాలెం 33/11కేవీ క్రికెట్ స్టేడియం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సప్తగిరి ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా లా కాలేజీ రోడ్డు, చాణక్యపురి లేఅవుట్, బింద్రానగర్, పీర్‌లెస్ కాలనీ, కారుషెడ్ జంక్షన్, సప్తగిరి కాలనీ, తారకరామా నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

పద్మనాభం మండలంలో..

పద్మనాభం: మండలంలోని రేవిడి 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో కోరాడ ఫీడర్ లైన్‌లో చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. కోరాడ, గెద్దపేట, లింగన్నపేట, బి.ఆర్.తాళ్లవలస, బొత్సపేట, బుడ్డివలస, ఐనాడ, దువ్వపేట, సుంకరపేట, భధ్యయ్యపేట గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

యోగాతోనే ఆరోగ్యాంధ్ర



మధురవాడలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

మధురవాడ: క్రమం తప్పని యోగా సాధనతో ఆరోగ్యాంధ్ర సాధ్యం అవుతుందని చంద్రంపాలెం హైస్కూల్ హెచ్‌ఎం రవి అన్నారు. పాఠశాలలో యోగా ట్రైనర్ సునీత ఆధ్వర్యంలో గురువారం ఉదయం యోగా తరగతులు నిర్వహించారు. పిల్లలకు, వయోజనులకు యోగా ఇతివృత్తం, చిత్రలేఖనం, లఘు నాటికలు, ప్రోత్సాహక విధానాలు తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. ఇక్కడ గెలుపొందిన వారు మండల స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధిస్తారన్నారు. కార్యక్రమంలో పీడీ నాగమణి, పీకేఎం లక్ష్మి, ఆర్ట్ టీచర్లు హైమావతి, సీఆర్‌పీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



యోగా శిక్షణలో పాల్గొన్న ఎంపికైన సభ్యులు

యోగా కేంద్రంలో శిక్షణ ప్రారంభం

భీమునిపట్నం: భీమిలిలోని అంతర్జాతీయ యోగా శిక్షణ కేంద్రంలో గురువారం మూడు రోజుల యోగా శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖలో జరగనున్న సామూహిక యోగా ప్రదర్శనలో పాల్గొనున్న వారికి ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. భీమిలి జోన్, మండల పరిధి నుంచి ఎంపిక చేసిన వారు ఇక్కడ ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, ఎంఈవో–2 జయప్రద, యోగా కేంద్ర కార్యదర్శి అప్పలనాయుడు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న ఉద్యోగులు

డిగ్రీ కళాశాలలో..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపిక చేసిన విద్యార్థులకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇచ్చారు. ఇందులో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ మాట్లాడుతూ యోగా ఆవశ్యకత, ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు శిక్షణ

పద్మనాభం: యోగాంధ్రలో భాగంగా మండలంలోని రెండు కేంద్రాల్లో గురువారం ప్రభుత్వ ఉద్యోగులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. వెలుగు, మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పలు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనీలు ఎల్.రామ సత్యం, ఇమంది వెంకటరాజు, సౌజన్య ఈ శిక్షణ ఇచ్చారు.

విశాఖను హరిత నగరంగా తీర్చిదిద్దుదాం

ఏపీ ఎన్‌సీసీ 13వ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్



ధాన్యం కంకులను పరిశీలిస్తున్న నీరజ్‌కుమార్

కొమ్మాది: పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ ఎన్‌సీసీ 13వ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్, కమాండింగ్ ఆఫీసర్ నీరజ్ కుమార్ అన్నారు. రుషికొండలోని గాయత్రి విద్యా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖను హరిత నగరంగా తీర్చిదిద్దడానికి ఎన్‌సీసీ కూడా పూర్తి స్థాయిలో కృషి చేస్తోందన్నారు. సమస్త జీవరాశిని కాపాడుకోవడం కోసం తమ వంతు కృషి చేయాలని కోరారు. ప్రీ ఎన్‌సీసీ క్యాడెట్ పర్యావరణహితంగా జీవించాలని పిలుపునిచ్చారు. జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యం కోసం తాము చేస్తున్న కృషిని వివరించారు. వేసవి కాలంలో పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. పిచ్చుకల సంతతిని పెంపొందించేందుకు గూళ్ల ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కంకుల కుచ్చులు తయారు చేసి అనువైన ప్రదేశంలో అమర్చాలని కోరారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు

చినుకు పడితే అడుగు వేయలేం..

- శంకుస్థాపన చేసి పట్టించుకోని పాలకులు
- వాయిదాలతో సరిపెడుతున్న అధికారులు
- తరచూ ప్రమాదాలు.. వాహనదారులకు గాయాలు



సంగివలస పాండ్రంగి రహదారి ప్రారంభంలో బురదమయమైన బీటీరోడ్డు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంగివలస జాతీయరహదారి నుంచి పద్మనాభం మండలం పాండ్రంగి వెళ్లే బీటీ రోడ్డు పాలాలను తలపిస్తున్నాయి. రెండు నెలల క్రితం ఈ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భూమిపూజ చేసినా, పనులు అంగుళం కూడా ముందుకు సాగలేదు. ఏడాదిగా జీవీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది ఇక్కడి ప్రజలను మభ్యపెడుతూ రోడ్డు నిర్మాణాన్ని వాయిదా వేస్తూ వస్తున్నారు. ఏడాది క్రితం ఎన్నికల తరువాత విజయదశమి, సంక్రాంతి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అంటూ ప్రతిసారి సాకులు చెప్పి ఇక్కడి ప్రజల ఆగ్రహం నుంచి త్రుటిలో తప్పించుకుంటున్నారు. ఎండగా ఉంటే ధూళి.. వానొస్తే బురద వర్షాలు పడని సమయంలో వచ్చీపోయే వాహనాల నుంచి ధూళి ఇళ్లలోకి చేరుతోంది. దీంతో ట్యాంకర్లతో నీళ్లు చల్లి తాత్కాలిక ఉపశమన చర్యలు చేపట్టి సరిపెడుతున్నారు జీవీఎంసీ సిబ్బంది. రోడ్డుపై పడిన గుంతల కారణంగా వర్షాలకు పొలాలను తలపిస్తున్నాయని అంటున్నారు. ముఖ్యంగా ఈ మార్గంలో ద్విచక్రవాహనాలపై ప్రయాణించేటప్పుడు ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. స్థానికులు రోడ్డు కోసం అడుగుతున్న ప్రశ్నలకు జవాబు చెప్పలేక ఈ ప్రాంత టీడీపీ నాయకులు ముఖం చాటేస్తున్నారు. సుమారు కిలోమీటరు పొడవునా బీటీ రోడ్డు ఎంతమాత్రం ప్రయాణానికి అనుకూలంగా లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

కేఎంఆర్ కాలేజీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఆర్ఐవో మురళీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

విశాఖ విద్య: విద్యార్థులను మోసగించిన మధురవాడ కేఎంఆర్ జూనియర్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పిఠాపురం కాలనీలోని ఆర్ఐవో కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నితిన్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడాలని చూసిన కేఎంఆర్ జూనియర్ కళాశాల అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఫేక్ ఎంసెట్ హాల్‌టికెట్లు అందించిన కారణంగా ఐదుగురు పరీక్ష రాయలేకపోయారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆర్ఐవో మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి ప్రసాద్, స్టేట్స్ సోషల్ మీడియా కన్వీనర్ వివేక్, జోనల్ ఇన్‌చార్జి ధనుష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి చద్దన్నం నివేదన



అమ్మవారికి జిబ్బెలతో సమర్పించిన చద్దన్నం



చద్దన్నం అమ్మవారి ప్రతిరూపమైన పుట్ట వద్ద ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

పద్మనాభం: పద్మనాభం గ్రామంలో గురువారం చద్దన్నం అమ్మవారికి గ్రామస్తులు పూజలు చేశారు. ఈ గ్రామంలో వచ్చే నెల రెండు నుంచి నాలుగో తేదీ వరకు బంగారమ్మ ఉత్సవాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా చద్దన్నం అమ్మవారికి పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి తొరిపిన చద్దన్నాన్ని గురువారం ఉదయం మహిళలు జిబ్బెలతో పట్టుకుని సచివాలయం దగ్గర రావి చెట్టు వద్ద ఉన్న అమ్మవారి ప్రతిరూపమైన పుట్టకు నివేదించారు. ముందుగా జిబ్బెలతో చద్దన్నాన్ని పైకి కనిపించకుండా మహిళలు చీర కొంగులతో కప్పి ప్రదక్షిణ చేశారు. అనంతరం అమ్మవారికి నివేదించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాలాడ పాప, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యులు తాలాడ పద్మనాభం, కంటుబోతు ఎర్నాయుడు, బుగత రాము, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

తాళ్లవలస యువకుల నిజాయితీ



పైడిరాజు కుటుంబసభ్యులకు డబ్బులు అందిస్తున్న తాళ్లవలస యువకులు

తగరపువలస: పోగొట్టుకున్న బ్యాగ్‌ను బాధితుడికి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు తాళ్లవలస యువకులు. ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ గారిపేటకు చెందిన గారి పైడిరాజు ఈ నెల 27న సాయంత్రం విజయనగరం జిల్లా భోగాపురం మండలం అక్కివరం నుంచి భీమిలి మండలం గొల్లల తాళ్లవలస మీదుగా ద్విచక్రవాహనంపై వెళ్తూ రూ.60వేల నగదు, ప్రామిసరీ నోటు ఉన్న బ్యాగును పారేసుకున్నాడు. గొల్లల తాళ్లవలస వద్ద స్పీడ్ బ్రేకర్‌ను దాటే సమయంలో ఈ బ్యాగు పడిపోయింది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన యువకులు గొలగాని గోపాలకృష్ణ, నల్ల గోవింద, కొంగరాని సంతోష్ నడుచుకుంటూ వస్తూ రోడ్డుపై పడి ఉన్న బ్యాగ్‌ను గుర్తించారు. అందులోని ప్రామిసరీ నోటు ఆధారంగా బుధవారం ఆరా తీసి, బాధితుడిని గుర్తించారు. అనంతరం గారిపేట, గొల్లల తాళ్లవలస గ్రామ పెద్దలు గారి పైడితల్లి, గొలగాని రాము సమక్షంలో బాధిత కుటుంబానికి డబ్బులు, ప్రామిసరీ నోటు ఇచ్చి నిజాయితీ చాటుకున్నారు. ఈ సందర్భంగా యువకులను తాళ్లవలస పంచాయతీ వాసులు అభినందించారు.